## ఘనంగా యాదవ సదర్ సయ్యాట



సదర్ సయ్యాట నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, నవంబరు 3, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని వివేకానంద కాలనీలో ఆదివారం రాత్రి యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సదర్ సయ్యాట నిర్వహించారు. యువనాయకుడు వంగ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సదర్ సయ్యాట తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి, యాదవ సంఘం అధ్యక్షులు గడమల యాదయ్య యాదవ్, రాగుల వెంకటేశం యాదవ్, దాసరి నరేష్ యాదవ్, బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## భక్తులతో కిక్కిరిసిన నాచగిరి క్షేత్రం

**వర్గల్, నవంబరు 3 (ప్రభాతవార్త):** వర్గల్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కార్తీక సోమవారం పురస్కరించుకొని భక్తులతో కిక్కిరిసిపోయింది. శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు, స్వామివారి నిత్య కళ్యాణాలు, అభిషేకాలు అధిక సంఖ్యలో జరిగాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వులను అనుసరించి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గీతా హైస్కూల్ తూప్రాన్ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు మరియు నిజామాబాద్‌కు చెందిన శశికాంత్‌శర్మ జోషి కార్తీక పురాణం కార్యక్రమం నిర్వహించారు. కార్తీక దీపోత్సవంలో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని కార్తీక దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా, ధర్మకర్తలు వందా నాగరాజు, కొత్తపల్లి శ్రీనివాస్‌లు ఆలయానికి విచ్చేసిన మహిళలకు పసుపు కుంకుమను అందజేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని కార్యనిర్వహణాధికారి విజయరామారావు తెలిపారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధితశాఖ అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి జిల్లాలోని అన్నిప్రాంతాల నుంచి ప్రజలు ఎంతో నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని ప్రతి దరఖాస్తులను పరిశీలించి తర్వగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యలను ప్రాధాన్యంగా తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో 154 దరఖాస్తులను స్వీకరించినట్లు వివరించారు. కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగరాజమ్మ, డిప్యూటీ కలెక్టర్ భవ్య, వివిధశాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కోటిలింగాల ఆలయంలో కలెక్టర్ పూజలు...**

కార్తీక సోమవారం సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి జిల్లా కేంద్రంలోని కోటిలింగాల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు కలెక్టర్‌కు ఘనస్వాగతం పలికారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 3, ప్రభాతవార్త :**



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి 32 దరఖాస్తుదారులు సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రతి అర్జీపై తక్షణ చర్యలు తీసుకుని సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజల ప్రధాన సమస్యలపై పూర్తి దృష్టిపెట్టి పరిష్కార ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డిఆర్ఓ పద్మజ రాణి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలస్యం చేయకుండా ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలి

### రైసు మిల్లులకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి సూచన

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి 17 శాతం మాత్రమే తేమ శాతం ఉన్న ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపించడం జరుగుతుందని ఎలాంటి ఆలస్యం చేయకుండా ధాన్యంను దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి రైస్ మిల్లర్లకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఆమె సోమవారం జిల్లాలోని మిల్లర్లతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో హమాలీల సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రైస్‌మిల్లులు వెంటనే బ్యాంకు గ్యారెంటీ ఇచ్చి పౌరసరఫరాలశాఖతో అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్ ఈనెల 11లోగా పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లు జిల్లా వ్యాప్తంగా ప్రారంభించడం జరిగిందని ప్రారంభంలోనే అకాల వర్షాలతో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. హుస్నాబాద్ నుంచి జిల్లాలోని అన్ని రైస్ మిల్లర్లకు ప్రత్యేక పరిస్థితుల్లో తడిచిన ధాన్యాన్ని పంపించడం జరిగిందని సహకరించిన రైస్‌మిల్లర్లకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్, సివిల్ సప్లై జిల్లా అధికారి తనూజా, డిఎం ప్రవీణ్, శిక్షణ డిప్యూటీకలెక్టర్ భవ్య, మిల్లర్లు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనాలంటూ రైతుల రాస్తారోకో

**నంగునూర్, నవంబరు 3,ప్రభాతవార్త :** రైతులు ఆరుగాలం కష్టపడి పని చేసి పండించిన ధాన్యం మొంథా తుఫాన్ కారణంగా తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నంగునూర్‌లో వివేకానంద చౌరస్తా వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట మొలక వచ్చిన ధాన్యాన్ని పోసి రైతులు నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట పోలీసులు, తహశీల్దార్ మాధవి అక్కడికిచేరుకొని రైతులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తహశీల్దార్ మాధవి హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పని చేసి పండించిన వరి ధాన్యం తడిసి ముద్దయి మొకలకోస్తుంటే ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి షరతులు లేకుండా మొలక వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతూ ధర చెల్లించాలన్నారు. అనంతరం రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఎవో గీతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు చెలికాని మల్లేశం, తుమ్మకోలు మహేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నంగునూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

# విద్య, వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం

### రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**రామచంద్రాపురం, నవంబరు 3, ప్రభాతవార్త:**

విద్య, వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధ్యక్షతన రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు టు బిహెచ్‌కె కాలనీలో విఎస్టి కంపెనీ 8 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించనున్న 60 గదుల పాఠశాల, డైనింగ్ హాల్, అంగన్‌వాడి కేంద్రాల నిర్మాణాలకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహా, గృహనిర్మాణ సంస్థ ఎండి గౌతమ్‌లు భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కొల్లూరు డబుల బెడ్ రూం కాలనీ భవిష్యత్తులో ఎంతగానో అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. 15వేల కుటుంబాలకు చెందిన లక్ష మంది కాలనీలో నివాసం ఉండేందుకు వీలుగా కాలనీలో అన్ని రకాల సౌకర్యాలు, వసతుల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కాలనీలో ప్రహారి గోడ నిర్మాణం, క్రీడా మైదానంను త్వరలోనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీ నుంచి హైద్రాబాద్‌లోని నాంపల్లి, చార్మినార్, హైద్రాబాద్ వైపుకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేదని కాలనీ వాసులు మంత్రుల దృష్టికి తేగా 4 రోజుల్లో బస్సు కూత కాలనీలో వినిపిస్తుందన్నారు. కాలనీలో 8 కోట్ల రూపాయల సిఎస్‌ఆర్ నిధులతో పాఠశాల భవన నిర్మానానికి విఎస్టీ కర్మాగారం ముందుకు రావడం అభినందయమని కొనియాడారు. ఈ నెల 10 నుంచి సన్న బియ్యం అందేలా చర్యలు చేపట్టాలని, పోలీసు ఔట్ పోస్టుఏర్పాటు చేస్తామన్నారు. కాలనీలో వారం రోజుల్లో పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు సిసి కెమెరాలు వెంటనే అమర్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



కొల్లూరులో పాఠశాల భవన నిర్మాణానికి శ్రీకారం చుడుతున్న మంత్రులు, కలెక్టర్

**సంక్రాంతి నాటికి అర్బన్ పిహెచ్‌సి ఏర్పాటు**

**వైద్య ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహా**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పని చేస్తోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా తెలిపారు. ప్రత్యేక కమ్యూనిటీలకు చెందిన కుటుంబాలకు చెందిన లక్ష మంది కాలనీలో నివాసం ఉంటారని, వారికి మెరుగైన వైద్యం అందించేందుకు సంక్రాంతి నాటికి కాలనీలో ఆరు పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(అర్బన్‌పిహెచ్‌సి) ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్‌డిఓ రాజేందర్, డిఈఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సరస్వతి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ, రెవిన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యమైన సేవలకు చిరునామా పటాన్‌చెరు పెద్దాసుపత్రి

- * నిపుణులైన వైద్యులు, అత్యాధునిక వసతులు
- * సేవల్లో దేశంలోనే ఏడవ స్థానం
- * ప్రతి వైద్యుడు సేవా దృక్పథంతో పనిచేయాలి
- * సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం
- *ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు, నవంబరు 3, ప్రభాతవార్త**

ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్‌చెరు పట్టణంలోని టంగుటూరి అంజయ్య ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నాణ్యమైన సేవలకు చిరునామాగా నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆసుపత్రిని ఆధునిక సౌకర్యాలతో ఆధునికరించడంతోపాటు, రోగులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులను అడిగి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అత్యధిక శాతం నిరుపేదలే వైద్యం కోసం వస్తున్నారని, సేవా దృక్పథంతో వైద్యం అందిస్తూ వారి మన్ననలు పొందాలని వైద్యులకు సూచించారు. వైద్యులు సిబ్బంది అందించిన సేవల వల్లే కేంద్ర ఆరోగ్య శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి నాణ్యమైన సేవల విభాగంలో జాతీయస్థాయిలో ఏడవ స్థానం లభించిందని తెలిపారు. ఇదే దృక్పథంతో మరిన్ని అవార్డులను సాధించాలని కోరారు. ప్రతి సంవత్సరం 1500కు పైగా ప్రసూతి ఆపరేషన్లు నిర్వహించడంతో పాటు, 2 లక్షలకు పైగా రోగులకు ఔట్ పేషెంట్ విభాగంలో సేవలు అందించడం గర్వనీయమన్నారు. అన్ని విభాగాల్లో 24 గంటల పాటు వైద్య సేవలు అందించడంతోపాటు, వివిధ రకాల ల్యాబ్ టెస్టులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలను సూపరిండెంట్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. మరమ్మతులకు గురైన ఆక్సిజన్ ప్లాంట్లను వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలో పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ యూనిట్ ద్వారా ప్రతి నెల 33 మంది రోగులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులను నియమించాలని కోరుతూ అతి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞాపన చేయనున్నట్లు తెలిపారు. అతి త్వరలో మరో అంబులెన్స్ కొనుగోలుకు నిధులు కేటాయిస్తానని తెలిపారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సేవల్లో లోపం ఉండకూడదని ఆదేశించారు. సౌకర్యాలు లేవంటూ రోగులను వేరే ఆసుపత్రులకు రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆర్‌ఎంవో ప్రవీణ, ఆస్పత్రి సలహా సంఘం సభ్యులు రాములు గౌడ్, కంకర సీనయ్య, మాజీ కార్పొరేటర్ అంజయ్య, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## ఘనంగా శ్రీ పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

### -హాజరైన మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్

**వర్గల్, నవంబరు 3 (ప్రభాతవార్త):** మండలంలోని దండుపల్లి గ్రామంలో శ్రీ పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, వర్గల్ మండల అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారు ప్రజలందరినీ చక్కగా చూడాలని నల్లపోచమ్మ, ముత్యాలమ్మ విగ్రహాలను ప్రతిష్టించుకొని పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మైసమ్మ, ముత్యాలమ్మ, సీతలమ్మ అందరూ తల్లులే మనలని కాపాడుతారని చెప్పారు. భూమిని భూతల్లిగా పూజిస్తామని, అమ్మవారి అనుగ్రహం మనందరిపై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు శ్రీకాంత్, శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు జంగం యాదగిరి, వేలూరి జగన్, బబ్బూరి రవీందర్‌గౌడ్, చింతల ఆంజనేయులు, బూత్ అధ్యక్షుడు రాజు, కృష్ణ, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఈటల రాజేందర్

# పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50 వేల పరిహారం అందించాలి

### సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేష్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 3, ప్రభాతవార్త**

తుఫాను వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేల నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం హుస్నాబాద్‌తోపాటు మండలంలోని మహ్మదాపూర్ గ్రామంలోని రైతుల పొలాలను పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అసమర్థ పాలకులు, జాతీయ రహదారి అధికారుల నిరక్ష్యంతోనే హుస్నాబాద్‌లోని ఇండ్లల్లోకి వరద నీరు చేరి వర్తక, వాణిజ్య వ్యాపారులతోపాటు ఎంతో మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. నష్టపోయిన ప్రతీ ఒక్కరిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదల్లో రైతుల ధాన్యంతోపాటు ఇసుక మేటలుపెట్టి పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయని చెప్పారు. పంటల నష్టంపై ప్రభుత్వం వెంటనే స్పందించి, వ్యవసాయ శాఖ రెవెన్యూ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలపై గ్రామాల్లో సమగ్రంగా సర్వే నిర్వహించాలని డిమాండ్‌చేశారు. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా డ్రైనేజీ నిర్మాణం పనులు లేవల్ నిబంధనలు పాటించకపోవడం వల్లే వర్షాలు పడిన ప్రతీసారి పట్టణంలోని వందలాది ఇండ్లల్లోకి వరద నీరు చేరి ప్రజలు అనేకసార్లు తీవ్రంగా నష్టపోతున్నారని రాష్ట్ర, జిల్లా, ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపం ఒక కారణమే అన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాలు కారణంగా మృతి చెందిన భాధిత కుటుంబాలు, రైతులు, ప్రజలు, వర్తక, వాణిజ్య వ్యాపారులకు తీవ్ర నష్టం వాటిల్లి నష్టపోయినందున నష్ట పరిహారం తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కుమారస్వామి, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, నాయకులు ఎల్లయ్య, మహ్మదపూర్ గ్రామ కార్యదర్శి పిట్టల మొగిలయ్య, మాజీ ఎంపిటిసి పిట్టల సుధాకర్, నాయకులు అయిలేని మల్లారెడ్డి, పిట్టల ప్రసాద్, దుద్దేడ రాజయ్య, జిల్లెల్ల సుధాకర్‌రెడ్డి, పిట్టల బాలయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



నష్టపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్న మల్లేష్ తదితరులు



న్యాల్‌కల్‌లో రోడ్డు పక్కన చెత్త చెదారాన్ని తొలగించిన దృశ్యం

'వార్త' ప్రభావం

## న్యాల్‌కల్‌లో చెత్తాచెదారం తొలగింపు

**న్యాల్‌కల్, నవంబరు 3, ప్రభాతవార్త:** న్యాల్‌కల్‌లో పడకేసిన పారిశుధ్యం, అనారోగ్యాలతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి 'వార్తా'కథనానికి అధికారులు స్పందించారు. న్యాల్‌కల్‌లోని మెయిన్ రోడ్డు పక్కన మురుగు కాల్వ పక్కన చెత్తా చెదారం పేరుకుపోవడంతో పందులు, ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తుండటంతో గ్రామస్థులతో పాటు మండల కేంద్రానికి ఆయా గ్రామాల నుంచి వచ్చే ప్రజలు ముక్కున వేలేసుకుని ప్రయాణించే పరిస్థితి దాపురించింది. ప్రజలు పడుతున్న పాట్లను 'ప్రభాతవార్త' నవంబరు 1న 'పడకేసిన పారిశుధ్యం, అనారోగ్యాలతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి' శీర్షికతో సమస్యను వెలుగులోకి తేవడంతో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో చెద్దాచెదారంగా మారిన ప్రాంతాలను పరిశుభ్రం చేయించారు. రోడ్డు పక్కన చెత్తను పంచాయతీ కార్మికులు తొలగించడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'వార్త' ప్రభావం

## పంచాయతీ కార్యదర్శికి సంజాయిషీ నోటీసు

**హత్నూర, నవంబరు 3, ప్రభాతవార్త :**

'వార్త' దినపత్రికలో సోమవారం వచ్చిన "అనుమతులు లేకుండానే పరిశ్రమ నిర్మాణం పనులు చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు" అనే శీర్షికకు పంచాయతీ రాజ్ అధికారులు స్పందించారు. చందాపూర్ గ్రామపంచాయతీ కార్య దర్శి కి సంజాయిషీ నోటీసులు జారీ చేసినట్లు హత్నూర ఎంపీఓ ఎం. డి.యూసుఫ్ తెలిపారు నిర్మాణాలకు సంబంధించిన పూర్తి నివేదిక ఇవ్వాలని కోరినట్లు ఆయన తెలిపారు. అనంతరం తగిన చర్య తీసుకుంటామని ఆయన తెలిపారు.

## చిన్నకోడూరు ఎంఈవోగా తిరుపతి

**కొమురవెల్లి, నవంబరు 3, ప్రభాతవార్త :** చిన్నకోడూరు మండల విద్యాధికారిగా సోమవారం తిరుపతి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నకోడూరు మండలాన్ని విద్యారంగంలో మొదటి స్థానంలో నిలుపడానికి కృషి చేస్తానన్నారు. మండలంలో టెన్త్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి ఇతరులకు ఆదర్శంగా నిలిచే చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో యాదవరెడ్డి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**కొండాపూర్, నవంబరు 3 (ప్రభాతవార్త):** గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సోమేశ్వరి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం సుమారు 40 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి మునిదేవునిపల్లి గ్రామ శివారులో బిచ్చమెత్తుకుని తింటూ రోడ్డు పక్కనే పడుకునేవాడు. మూడు రోజుల నుంచి ఏమి తినకుండా రోడ్డు పక్కనే కదలలేని స్థితిలో పడి వున్నాడు. ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో సమాచారము తెలుసుకుని ఆతడిని సంగారెడ్డి ప్రభుత్వ అసుపత్రిలో చెర్పించగా చికిత్స పొందుతు సోమవారం ఉదయం 11 గంటలప్రాంతంలో మృతి చెందినట్లు ఆమె తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు స్థానిక పోలీస్‌స్టేషన్, ఫోన్‌నంబర్లకు 8712656748,8712656722 సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్ష

**మర్కుక్, నవంబరు 3 (ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్షతోపాటు జరిమానా విధించడం జరిగిందని ఎస్ఐ దామోదర్ తెలిపారు. మర్కుక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కరీంనగర్‌కు చెందిన గురుసింగ శేఖర్(25)ను బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేయగా మద్యం తాగి ఉన్నట్లు రిపోర్టు వచ్చిందని తెలిపారు. అతడిని సోమవారం గజ్వేల్ మున్సిఫ్ కోర్టు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట హాజరు పరచగా విచారణ చేసి రెండు రోజుల జైలుశిక్షతోపాటు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ దామోదర్ మాట్లాడుతూ ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే వారికి రూ.10వేల జరిమానాతో పాటు జైలు శిక్ష విధించడం జరుగుతుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కావున మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని సూచించారు.

**తొమ్మిది మందికి రూ.90వేల జరిమానా...**

**గజ్వేల్, నవంబరు 3 (ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన తొమ్మిది మందికి రూ.90వేల జరిమానా విధించడం జరిగిందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. కొన్ని రోజులుగా గజ్వేల్‌లోని పిడిచెడ్ రోడ్డు, క్యాసారం ఎక్స్ రోడ్డు, తూప్రాన్ రోడ్డు, ముట్రాజ్‌పల్లి రోడ్డు, సంగాపూర్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా తొమ్మిది మంది వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా వారిని పట్టుకొని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం తాగి ఉన్నట్లు రిపోర్టు వచ్చిందని, వారిని సోమవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ చేసి తొమ్మిది మందికి రూ.90వేల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు టాక్టర్‌ల పట్టివేత

**అక్కన్నపేట, నవంబరు 3, ప్రభాతవార్త :** ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ చాత రాజు ప్రశాంత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని జనగామ వాగు నుండి ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మలిచెరువుతండాకు రవాణా చేస్తున్న నంబర్ ప్లేట్లు లేని రెండు ట్రాక్టర్‌లను తమ సిబ్బంది పట్టుకున్నారని, రెండు బండ్లను సీజ్ చేసి కేసునమోదు చేసినట్లు ఆయన వివరించారు. అక్కన్నపేట మండలంలో అనుమతులు లేకుండా ఇసుక, మట్టి, పిడిఎస్ రైస్ లాంటివి రవాణా చేస్తే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు.




సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

## శివపంచాయతన ప్రతిష్ఠాయాగ మహోత్సవంలో మాజీ ప్రణాళికాసంఘం సభ్యులు



ప్రతిష్ఠామహోత్సవంలో పాల్గొన్న నాయకులు

**నారాయణఖేడ్, నవంబరు 3, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ మున్సిపల్‌లోని నెహ్రూనగర్ కాలనీలో పురాతన శ్రీ వీరాంజనేయసహిత శివపంచాయతన ప్రతిష్ఠాయాగమహోత్సవంలో నగేష్ శెట్కార్ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించి శ్రీవీరాంజనేయస్వామి, శివపంచాయతన దేవతల దర్శనం చేసుకున్నారు. అనంతరం కాలనీ వాసులు ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళికాసంఘం సభ్యులు నగేష్ శెట్కార్, మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ ప్రముఖులు, భక్తులు, స్థానికప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

-తహసీల్దార్‌కు బిజెపి నాయకుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

**అల్లాదుర్గం, నవంబరు 3, ప్రభాతవార్త:**

ఇటీవల కురిసిన భారీవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బిజెపి మండల అధ్యక్షులు జిన్నా భాస్కర్ సోమవారం తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ రేయి, పగలు అనకుండా ఆరుగాలం కష్టించి పండించిన పత్తి, వరి, మినుము, పెసరపంటలు నీటిపాలవడంతో రైతులు అవస్థలు పడాల్సి వచ్చిందని, పంటలసాగుకు పెట్టిన పెట్టుబడులు అందక ఆర్థికంగా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులను పరిహారం అందించి ఆదుకోవాలని భాస్కర్ డిమాండ్‌చేశారు.

## పద్మశాలి యువజన కార్యవర్గం ఎన్నిక

**నారాయణఖేడ్, నవంబరు 3, ప్రభాతవార్త**

నారాయణఖేడ్ పట్టణ పద్మశాలి యువజన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. యువజనసంఘం గౌరవ అధ్యక్షులుగా సోమ సిద్ధి రాములు, అధ్యక్షులుగా గుండు శివకుమార్, ఉపాధ్యక్షులుగా బాయిని కిషన్, దుర్గం సతీష్, జనరల్ సెక్రటరీగా గోస్కె శ్రీనివాస్, కోశాధికారిగా బాయిని శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా గాజుల జ్ఞానేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సామల శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, సంఘసభ్యులుగా బోడ సాయికుమార్, మంత్రి అనిల్, బోడ జ్ఞానేశ్వర్, బోడ దుర్గాప్రసాద్, బొడ్డు రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సంఘసభ్యులు మాట్లాడుతూ పద్మశాలిసంఘం అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో పద్మశాలి పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## గడిపెద్దాపూర్‌లో వరి కొనుగోలుకేంద్రం

-కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్‌కమిటీ చైర్మన్ లక్ష్మీశేషారెడ్డి



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

**అల్లాదుర్గం, నవంబరు 3, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని గడిపెద్దాపూర్‌లో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వట్‌పల్ల మార్కెట్‌కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మీశేషారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రానికి వరిని తరలించి ఆర్థికంగా లబ్దిపొందాలని, మధ్య దళారులకు అమ్ముకుని ఆగంకావొద్దని మండలరైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం రుక్మిణి, మాజీ ఎంపిటిసి సభ్యులు విఠల్‌రెడ్డి, డీలర్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు సొమ్యనాయక్, రైతులు పాల్గొన్నారు.

## పాఠశాల నిర్మాణానికి భూమిపూజ



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**నర్సాపూర్, నవంబరు 3, ప్రభాతవార్త:**

నర్సాపూర్ పట్టణంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల1 భవనం శిథిలావస్థకు చేరుకోగా ఈపాఠశాల నూతనభవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని రెండవవార్‌లో గల ప్రాథమిక పాఠశాల1 భవనం శిథిలావస్థకు చేరుకొని, కూలడానికి సిద్ధంగా ఉంది. దీంతో విద్యార్థుల విద్యాబోధనకు ఎన్నో ఇబ్బందులు కలిగేవి. ఈమేరకు రెండవవార్డ్ మాజీ కౌన్సిలర్ లతారమేష్‌యాదవ్‌తో పాటు కాలనీవాసులు ఈపాఠశాల నూతనభవనం నిర్మించాలని వినతి చేసినా, ఫలితం లేకుండాపోయింది. ఈవిషయం తెలుసుకున్న డెక్కన్ రౌండ్ టేబుల్ ట్రస్ట్ ఇండియా 189 ప్రతినిధులు స్పందించి పాఠశాల నూతనభవన నిర్మాణానికి ముందుకువచ్చారు. ఈమేరకు ట్రస్ట్ చైర్మన్ ఆదిత్య కెడియ సతీష్ విచ్చేసి సుమారు రూ.50లక్షలతో నూతన పాఠశాల భవననిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.50లక్షల నిధులతో పాఠశాల భవనం, మరుగుదొడ్లు, తరగతిగదుల నిర్మాణం చేపట్టనున్నారు. నూతన పాఠశాల భవనం మూడునెలల్లో పూర్తిచేస్తామని ట్రస్ట్ చైర్మన్ హామీ ఇచ్చారు. ఈభవన నిర్మాణం జరిగితే విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పలువురు ఆనందంవ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ తారాసింగ్, ప్రధానోపాధ్యాయులు సర్వేష్, రెండవవార్డ్ మాజీకౌన్సిలర్ లతారమేష్‌యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## గాయత్రి యజ్ఞ పూజలు

**బేగంబజార్, నవంబరు 3, ప్రభాతవార్త:**

గాయత్రి యజ్ఞన పరివార్ ఆధ్వర్యంలో రహీంపురా గ్రౌండ్‌లో108 యజ్ఞ హోమపూజలను వేదబ్రహ్మచే నిర్వహించడం జరిగింది. యజ్ఞహోమంలో గ్రేటర్‌హైదరాబాద్ మహానగరపాలక బిజెపి ఫ్లోర్‌లీడర్ గొంటి శంకర్ యాదవ్, గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, బిజెపి నాయకులు కృష్ణ, పాల్గొన్ని ప్రత్యేకపూజలను చేశారు. నిర్వాహకులు బల్‌దేవ్‌సింగ్ పర్యవేక్షణలో గాయత్రి యజ్ఞ హోమం పూజలు కొనసాగాయి.

# ముఖ్యమంత్రిపై బిజెపి నాయకుల నిరసన

-ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటం దహనం

సిఎం అనుచిత వ్యాఖ్యలపై బిజెపి నాయకుల ఆందోళన

-అడ్డుకున్న పోలీసులు

**నర్సాపూర్, నవంబరు 3, ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశ సైనికులపై, బిజెపి పార్టీపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తాలో బిజెపి నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా బిజెపి నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకుగాను బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు నిరసనగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా, ఇందుకు స్పందించిన స్థానికపోలీసులు రంగప్రవేశంచేసి సిఎం చిత్రపటం ని దహనం చేయడాన్ని అడ్డుకున్నారు. బిజెపి నాయకులు సిఎం డౌన్ డౌన్, కాంగ్రెస్ పార్టీ డౌన్ డౌన్ అంటూ నినదించారు. ఈసందర్భంగా బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ దేశభద్రత కోసం సరిహద్దుల్లో వణికి వణుకుతూ దేశాన్ని రక్షిస్తున్న సైనికులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతో దురదృష్టకరమన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు పునరావృతం అయితే ఊరుకునేదిలేదని మరింతగా నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని పాపగారి రమేష్‌గౌడ్ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఓబిసి ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్‌గౌడ్, జిల్లా కార్యదర్శి బాదే బాల రాజ్, జిల్లా ఓబిసి ఉపాధ్యక్షుడు గుండం శంకర్, పట్టణ ప్రధాన కార్యదర్శులు సంఘసాని రాజు, రామ్‌రెడ్డి, ఎస్టీ మోర్చా జిఎస్ రాములునాయక్, ఎస్సీ మోర్చా టౌన్ ప్రెసిడెంట్ పబ్బొరి కృష్ణ, కో కన్వీనర్ సిర్మోని నరేందర్, బిజెపి నాయకులు ప్రేమ్‌కుమార్, సంజీవరెడ్డి, బాలు, నర్సింగరావు, రాజు, దుర్గాప్రసాద్, నారాయణ నర్సాపూర్ బూత్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి నాయకులు దృశ్యం

## అంగన్‌వాడీ వద్ద డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



అంగన్‌వాడీ చిన్నారులతో మాట్లాడుతున్న దాసరి ఏగొండస్వామి

**గజ్వేల్ టౌన్, నవంబరు 3, ప్రభాతవార్త:**

గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని మూడవ అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ డ్రైనేజీనీరు పారుతుందని, దీనివల్ల పిల్లలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు. సోమవారం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడకండ్ల గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ లేకపోవడంతో పిల్లలను మూడవ అంగన్‌వాడీ కేంద్రానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ మురికినీరు పారడం వల్ల అంగన్‌వాడీ భవనం గోడ పగుళ్లు ఏర్పడ్డాయని, ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందో అనేవిధంగా మారిందన్నారు. మురికినీరు పారటంవల్ల ఈగలు, దోమలు, పందులు వస్తున్నాయని తెలిపారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లేకపోవడం వల్ల స్వచ్ఛమైన నీరు పిల్లలకు అందడంలేదన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## ఘనంగా వింటర్ కిడ్స్ కార్నివాల్

- హాజరైన రాష్ట్రపతి అవార్డు గ్రహీత

**జూబ్లీహిల్స్, నవంబరు 3, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ ఆత్మకూరి రామారావు పాఠశాలలో వింటర్ కిడ్స్ కార్నివాల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు సృజనాత్మకత, వ్యాపార నైపుణ్యాలు, సామాజిక మమకారం పెపొందించే వేదికగా ఇది నిలిచింది. సెలబ్రేషన్స్ ఇన్ఫ్యూజ్ లైఫ్ విత్ పాషన్ అండ్ పర్పస్ పేరుతో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి అవార్డు గ్రహీత, బహుళ జాతీయ సంస్థలో మానవవనరుల నిపుణురాలైన శాలిని ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచి వివిధ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా వారిలో ఉండే సృజనాత్మకతను వెలికితీయవచ్చని అన్నారు. అలాగే కొత్త ఆవిష్కరణలకు నాంది వేయవచ్చన్నారు. ఈదిశలో తల్లిదండ్రులతోపాటు పాఠశాలలోని ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల ఆలోచనలను గమనించి ఆ దిశగా వారిని ప్రోత్సహించాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలతానాయర్ మాట్లాడుతూ తమ పిల్లల ఆలోచనలు తల్లిదండ్రులకు సైతం తెలియాలనే ఆలోచనతో ఈకార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా క్రీడలు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, మెహందీ, నెయిల్ ఆర్ట్, టాటూ పెయింటింగ్, ఫుడ్ స్టాల్, సెల్ఫీ పాయింట్, దుస్తుల స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పిల్లల కోసం ఏర్పాటుచేసిన అవుట్‌డోర్ గేమ్స్ మరింత ఉత్సాహాన్ని నింపాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ కర్ణాటక సంగీతంకు ఆదరణ

- కర్ణాటక సంగీత విద్వాంసులు భీమ్‌సేన్

**చిక్కడపల్లి నవంబర్ 3 ప్రభాతవార్త:**

శాస్త్రం పట్ల పూర్తి పట్టు ఉండి శిష్యులను నైపుణ్యం ఉన్న కళాకారులుగా శిక్షణ ఇచ్చే గురువులు దొరకడం శిష్యుల అదృష్టమని ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు భీమ్‌సేన్ అన్నారు. శాస్త్రీయ కర్ణాటక సంగీతానికి ఆదరణ ఉంది అని చెప్పారు. సోమవారం రాగతరంగిణి మ్యూజిక్ స్కూల్ నిర్వాహణలో శ్రీముఖి కాంప్లెక్స్‌లోని అల్లైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియంలో ప్రముఖ సంగీత కళాకారిణి గురువు తరంగిణి రామరాజు శిష్యులు సిరి ఐశ్వర్య, ఆరాధ్యలు శాస్త్రీయ గానగోష్టి లయ స్వర తాళ బంధుర సమన్వితంగా జరిగింది. అన్నమయ్య రామదాసు త్యాగరాజు కీర్తనలు మధురంగా ఆలపించారు ముఖ్య అతిథిగా భీమ్‌సేన్ పాల్గొని విద్యార్థులను అభినందిస్తూ తరంగిణి వంటి ఉత్తమగురువు లభించటం వారి అదృష్టం కాగా అంకిత భావం కల శిష్యులు దొరకడం గురువు అదృష్టం అన్నారు. తరంగిణి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ కర్ణాటక సంగీత సర్టిఫికెట్ కోర్స్‌లో తమ సంస్థ విద్యార్థులు మెరిట్‌తో ఉత్తీర్ణులు అయ్యారు అని తెలిపారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, డాక్టర్ తెన్నేటి సుధ పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్ కళాశాలలో అబ్బురపరిచిన జెస్టా ఫెస్టివల్

-సమ్మోహనంగా ప్రదర్శించిన వెల్కమ్ డ్యాన్స్

**మెహిదీపట్నం నవంబర్ 3, ప్రభాతవార్త:**

మెహిదీపట్నం సెయింట్ ఆన్స్ మహిళ కళాశాలలో జెస్టా ఫెస్టివల్ వేడుకలు అబ్బురపరిచాయి. నగరంలోని వివిధ కళాశాలల నుండి రెండువేలకు పైగా విద్యార్థులు ఈవేడుకల్లో పాల్గొనడంతో కళాశాల ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. సెయింట్ ఆన్స్ మహిళ కళాశాల బిజినెస్ మేనేజ్ మెంట్ పీజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో జెస్టా 10వ వార్షికోత్సవ వేడుకలు విజయవంతంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండస్ ఇండ్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్, కళాశాల మాజీ విద్యార్థిని శిబాచావళి హాజరై జెస్టా పదేళ్ల ప్రయాణాన్ని గుర్తుచేస్తూ న్యూస్ లెటర్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం శిబాచావళి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ఏ.విజయరాణిలు మాట్లాడుతూ...భారత మహిళ క్రికెట్ జట్టు సాధించిన విజయాన్ని ప్రస్తావిస్తూ మహిళ సాధికారతను గుర్తుచేశారు. ఈ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించిన బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని అభినందించారు. ఫెస్టివల్‌లో వివిధ మేనేజ్‌మెంట్ ఈవెంట్లు నిర్వహించబడగా 40 స్టాళ్లలో రుచికరమైన భోజనాలు, ఫ్యాషన్, హస్తకళ ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. విభిన్న ఋతువులను ప్రతిబింబించే నృత్య రూపాల సమ్మోహనంగా ప్రదర్శించిన వెల్కమ్ డాన్స్ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్రీడా రంగాలకు అత్యంత ప్రాధాన్యత

-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్, నవంబర్ 3,ప్రభాతవార్త:**

క్రీడారంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో క్రీడాకారుడు మాస్టర్ రామును కలెక్టర్ హరిచందన దాసరి సన్మానించి అభినందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ 2022 లో కాంస్య పతకం (ట్రయాథ్లాన్) అలాగే 34వ సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ 2023, 35వ సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ 2024లో బంగారుపతకాలు (పెంటాథ్లాన్) సాధించడం జరిగిందన్నారు. అలాగే జాతీయస్థాయిలో జరిగిన 40వ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025, 20వజాతీయ యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్, 2025లలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. అతని విజయాలను అభినందిస్తూ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మరెన్నో పతకాలు సాధించాలని, తెలంగాణ అలాగే దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని అభినందించి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి ఎన్.సుధాకర్‌రావు, కోచ్ జి.రాజేష్ పాల్గొన్నారు.

## సాహిత్య సంగీత రూపకం

**రవీంద్రభారతి, నవంబరు 3 ప్రభాతవార్త:**

భారతీయ ఆత్మకు ఆదిశంకరుడు ఎలాగైతే నిదర్శనమో తెలుగు సారస్వతానికి తెలుగుపద్యం అలాంటిదని, వీటిని విస్మరిస్తే సాహిత్యాన్ని నిర్వచించలేమని ప్రముఖ సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సంస్థ 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ఆకర్షణ ప్రదర్శింపబడిన కవులే గాయకులైతే ...? సాహిత్య సంగీత రూపకం నవరసభరితంగా సాగింది. ఈమేరకు డా. టి.గౌరీశంకర్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా.ఓలేటి పార్వతీశం విశిష్ట అతిథులు సుధామ, డా. పి.లలితవాణి, పి.గోపాల కృష్ణమూర్తి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చిమ్మపూడి శ్రీరామమూర్తి తదితరులతో కలిసి ఫౌండేషన్ ప్రత్యేక సంచిక దీపికను ఆవిష్కరించి మాట్లాడారు. పద్యాన్ని పట్టుకుంటే భారతీయ సంస్కృతి, తెలుగును సులువుగా అవగతం చేసుకోవచ్చన్నారు. సంస్థ బాలల కోసం పద్య, భగవద్గీత పఠనం, క్విజ్, వ్యాసరచన, దేశభక్తి గీతాలా పన వంటి అద్వితీయ కార్యక్రమాలు నిర్వహించడం హర్షదాయమని సంస్థను అభినందించారు

## బధిరుల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

-డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి

**చిక్కడపల్లి నవంబర్ 3 (ప్రభాతవార్త):**

తెలంగాణ రాష్ట్రంలో బధిరుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వి.భారతీ, ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్‌గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తిచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బధిరుల విద్య, ఉపాధి, సంక్షేమ రంగాల్లో అనేక సమస్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మలక్పేటలోని ప్రభుత్వ బధిరుల స్కూల్ ఆవరణలో ప్రభుత్వ హాస్టల్లో జూనియర్ ఇంటర్ నుంచి డిగ్రీ వరకు కాలేజీ ఏర్పాటు చేసి వసతులు కల్పించాలన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో సైగల భాష ద్వారా ప్రత్యేక మూగ బధిరుల స్కూల్ హాస్టల్ వసతులు కల్పించాలని కోరారు ప్రతి జిల్లాలో బధిర విద్యార్థుల కోసం 25 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. బధిరుల సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.

## విద్యార్థులకు ఓటు హక్కు లేదు అని చిన్న చూపా..?

-ప్రభుత్వం తక్షణమే ఫీజుల బకాయిలు చెల్లించాలి

-రాష్ట్రాల యువత అధ్యక్షులు కాలపురెడ్డి సాయిబాబా

**హైదరాబాద్, నవంబర్ 3,ప్రభాతవార్త:**

విద్యార్థులకు ఓటుహక్కు లేదని ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజుల రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని తెలుగు రాష్ట్రాల యువత అధ్యక్షులు, దక్షిణ మధ్య రైల్వే సభ్యులు కాలపురెడ్డి సాయిబాబా అన్నారు. సోమవారం విద్యానగర్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రేవేట్ కాలేజి యాజమాన్యాలు తలపెట్టిన బంద్‌ను విద్యార్థుల భవిష్యత్‌దృష్ట్యా విరమించుకోవాలన్నారు. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించింది కాని – విద్యార్థుల బిల్లులు చెల్లించారా? అన్ని ప్రశ్నించారు. ఫీజల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు అష్ట కష్టాల పాలవుతున్నారని ఫీజులు కట్టాలని కాలేజీ విద్యార్థులపై యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నారన్నారు. కోర్సు పూర్తయిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు వచ్చినవారికి అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. సర్టిఫికెట్లు తెసుకోలేక కొందరు ఉద్యోగాలు కోల్పోతున్నారు. పీజీ కోర్సులలో సీట్లు పొందిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఉద్యోగా లు పొందిన వారు ఇతర దేశాలలో ఉద్యోగాలు వచ్చిన వారికి కూడా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీనితో ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు. విదేశాలకు చదువు కోవడానికి సీట్లు వచ్చిన వారికి కూడా సర్టిఫికెట్లు లేక వెళ్లలేకపోతున్నారు.ఇక కాలేజీ యాజమాన్యాలు కష్టాలు కూడా చెప్పతరం కాదు అద్దె భవనాల అద్దె కట్టలేక కాలేజీ లెక్చరర్ల జీతాలు నెలల తరబడి ఇవ్వక ఇబ్బందులు పడుతున్నారన్నారు. లెక్చరర్లు, జీతాలు రాక కుటుంబాలు పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని కావున ఈసమస్య పరిష్కారం కావలంటే రిబయర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

-మీరాలం ఏడిఈ వెంకటేష్ గౌడ్

**చార్మినార్,నవంబరు 3 ప్రభాతవార్త:**

విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు,బకాయిలు చెల్లించి విద్యుత్ అధికారులకు అన్నివిధాల సహకరించాలని,పాతబస్తీలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయంకలగకుండ మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్నామని టిజిఎస్‌పిడిసిఎల్ మీరాలం సబ్ డివిజన్ ఏడిఈ వెంకటేష్ గౌడ్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం పాతబస్తీ మీరాలం విద్యుత్ సెక్షన్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల దినోత్సవం జరిగింది.పలు ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అధికారులకు కొత్త విద్యుత్ కనెక్షన్లు,విద్యుత్ మీటర్ మార్పిడితో పాటు విద్యుత్ సరఫరాలకు సంబంధించిన సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.

## ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే

**చిలిపిచెడ్, నవంబరు 3, ప్రభాతవార్త:**

గత వారంరోజుల నుంచి ప్రమాదానికి గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని గుజిరితాండా గ్రామ పంచాయతీకి చెందిన రామావత్ చక్రియా తండ్రి జాన్యాకు మెరుగైనచికిత్సకు ప్రభుత్వం నుంచి రూ.2లక్షల రూపాయలు ఎల్ఓసిని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాకేష్, జడ్పి కోఆప్షన్ మాజీసభ్యులు మన్సూర్, దుర్గారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజిరెడ్డి, విఠల్ తదితరులు ఉన్నారు.

## మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

**రేగోడ్, నవంబరు 3, ప్రభాతవార్త:**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల మీర్జాగూడ వద్ద సోమవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బిఆర్‌ఎస్ నాయకులు చెవుల బాలయ్య డిమాండ్ చేశారు. తండూరు డిపోకు చెందిన ఆర్టీసి బస్సును కంకర లోడ్‌తో వెళుతున్న లారీ ఢీకొన్న సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 20మందికి పైగా కానరానిలోకాలకు చేరిపోయారని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటిస్తూ క్షతగాత్రులకు మెరుగైనవైద్యం అందేలా కాంగ్రెస్‌ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాలయ్య సూచించారు.

## టేక్మాల్‌లో సిఎంరిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**టేక్మాల్, నబంబరు 3, ప్రభాతవార్త:**

కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులకు టేక్మాల్‌లో సోమవారం లబ్దిదారులకు పంపిణీచేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలమేరకు టేక్మాల్ మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో రైతువేదికలో లబ్దిదారులకు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ అధ్యక్షతన పంపిణీచేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్ మాట్లాడుతూ, దామోదర్ రాజనర్సింహ సహకారంతో కళ్యాణలక్ష్మీ, సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు త్వరగా మంజూరు అవుతున్నాయని తెలిపారు. చెక్కులుపొందిన లబ్దిదారులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ మజహర్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి మహేష్‌రెడ్డి, మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు సంగమేశ్వర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు భూమిరెడ్డి, రామచందర్‌లతోపాటు యూత్‌నాయకులు సాయిశేషుగౌడ్, వసీం, తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**అల్లాదుర్గం, నవంబరు 3, ప్రభాతవార్త:**

సిఎంఆర్‌ఎఫ్ పథకం పేదలకు వరంలాంటిదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆయాగ్రామాలకు చెందిన పలువురికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బలరాం, బాలకిషన్, కరుమ మహేష్, బేతయ్య, నర్సింలు, విఠల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చెన్నప్ప, ప్రభు, మధు, పాండు, కలీం, సురేష్, సదానంద, గోండ్ల రవి, జగదీశ్వర్, సాయిరెడ్డి, నర్సింలు, రామ్‌రెడ్డి, బాల్‌రాజ్, కొంక శ్రీశైలం, చక్రపాణి, బాల్యనాయక్, అంజయ్య, చంద్రయ్య, పాపయ్య, శ్రీను, సత్యనారాయణ, సాయిలు, జైపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణకారులు సంఘటితమైతే హక్కులను సాధించుకోగలుగుతాం

–స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షులు పూర్ణ రవిచారి



సమావేశంలో పాల్గొన్న పూర్ణ రవిచారితోపాటు సంఘసభ్యులు

**నర్సాపూర్, నవంబరు 3, ప్రభాతవార్త:**

స్వర్ణకారులు సంఘటితమైతేనే తమహక్కులను సాధించుకోగలుగుతారని స్వర్ణకారసంఘం జిల్లా అధ్యక్షులు పూర్ణ రవిచారి అన్నారు. ఆదివారం నర్సాపూర్‌లోని లక్ష్మీనారాయణస్వామి ఆలయ ఆవరణలో పట్టణ స్వర్ణకారసంఘం నూతన కార్యవర్గ ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పాల్గొన్న పూర్ణ రవిచారి మాట్లాడుతూ, ప్రభుత్వం స్వర్ణకారులను ఆదుకోవాలని అన్నారు. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతుండగా, గిరాకీలు లేక స్వర్ణకారులు ఉపాధిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి దామోదర్‌చారి, ఉపాధ్యక్షులు కృష్ణకుమార్, పాండురంగచారి, బిక్షపతిచారి, వేణుచారి మాట్లాడారు. ఈసందర్భంగా నర్సాపూర్ పట్టణ స్వర్ణకారసంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులు భాస్కర్‌చారి, ప్రధానకార్యదర్శి ప్రభుచారి, ఉపాధ్యక్షులు వినోద్, సలహాదారులు రామాచారి, నరసింహచారి ఎన్నికయ్యారు. వీరిచేత జిల్లానుంచి వచ్చిన నాయకులు ప్రమాణ స్వీకారం చేయించి, శాలువాలతో సన్మానించారు.

## రైతులు అధిక దిగుబడి పండించాలంటే ఆధునిక పనిముట్లపై అవగాహన ఉండాలి

–పటాన్‌చెరు ఆత్మ కమిటీ చైర్మన్



అవగాహన కార్యక్రమంలో కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి

**గుమ్మడిదల నవంబరు 3 ప్రభాతవార్త:**

కొత్తపల్లిలో నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో న్యూ ల్యాండ్ కంపెనీ ఆర్థికసహకారంతో కూరగాయలు కలుపు తీయుటకు యంత్రాలు, వ్యవసాయ పనిముట్లను పటాన్‌చెరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించడం జరిగింది. నేషనల్ ఆగ్రో సంస్థ ప్రతినిధి గజేందర్ కూరగాయల పంటల గురించి అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్నవారు అగ్రో సంస్థ తరపున ఏర్పాటు చేసిన రైతుసంఘం అధ్యక్షులు పెండెం ప్రభు, మాజీ ఉపసర్పంచ్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాకలి చంద్రయ్య, ఇంద్రమ్మ, కమిటీ సభ్యులు ఆగం రాజు, నీరుడి నర్సింలు, రైతులు నీరుడి నాగేష్ కుమ్మరి, శివ, మన్నే ఆంజనేయులు, నీరుడు కృష్ణ, నీరుడి సత్తయ్య, ఆగం మధు, లక్ష్మాపురం నర్సింలు, లక్ష్మాపురం మల్లేశం, తోలు ఎల్లయ్య, కొక్కొండ భాస్కర్, లక్ష్మాపురం, మల్లేశం పాల్గొన్నారు.

## కార్మికుల పీఫ్ వివరాలు తెలపాలి:

-ఏఐటియూసి

**నిజాంపేట్, నవంబర్ 3, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల, ఉద్యోగాల పిఎఫ్‌లో జమాయినా వాటి వివరాలు తెలపాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఏఐటీయూసీ మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కె.ఏసు రత్నం మాట్లాడుతూ ..అందుకే ప్రతి మూ డు నెలలకి పిఎఫ్ వివరాలు నోటిస్ బోర్డుపై పెట్టాలని, తద్వారా కార్మికులకు పిఎఫ్ వివరాలు అందుబాటులో ఉంటాయని వారు సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్, యాదయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బిజెపి నాయకులు

## పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**చేర్యాల, నవంబరు 3, ప్రభాతవార్త** : మొంథా తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వేచరేణి గ్రామంలో ఆ పార్టీ నాయకులు ఏర్పాటు చేసుకున్న సమావేశంలో సంజీవులు పాల్గొని మాట్లాడుతూ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రైతులకు నష్టపరిహారం అందించాలని ఈ నెల 6, 7 తేదీలలో జనగామ జిల్లాలో చేపట్టనున్న దీక్షను విజయవంతం చేయాలని అందుకు అన్ని గ్రామాల నుండి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు బూరుగు సురేష్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్ర మహేందర్‌రెడ్డి, జనగామ జిల్లా కార్యదర్శి కాశెట్టి పాండు, చేర్యాల పట్టణ అధ్యక్షుడు కర్క తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తౌట బాలరాజు, సీనియర్ నాయకుడు ముచ్చింతుల సిద్ధారెడ్డి, గోపాల్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఫంగ సిద్ధిలింగం, నాయకులు కుర్రారం బాలనర్సయ్య, మండల ఉపాధ్యక్షుడు కేతోజు చంద్రశేఖర్‌చారి, మండల కార్యదర్శులు రవిచారి, గంధాల సత్యనారాయణ, బూత్ అధ్యక్షుడు గుంటి రాములు, మాచర్ల ప్రవీణ్‌గౌడ్, కేతోజు సాయికుమార్‌చారి, బండారి ఐలయ్య, రాళ్ళబండి తిరుపతి, ముస్త్యాల శ్రీనివాస్, మారబోయిన మహేష్, నరేష్, అనిల్, సత్యం, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివిని సందర్శించిన ఎంఈవో వెంకటరాములు



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో వెంకటరాములు

**మర్కుక్, నవంబరు 3 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం మండల విద్యాధికారి వెంకటరాములు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, తరగతి గదులను, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సంబంధించిన తరగతిగదుల నిర్మాణ పనుల గురించి ఏఈ రాజేష్‌రెడ్డిని అడిగి తెలుసుకొని పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేకాధికారి, ఉపాధ్యాయినిలు ఉన్నారు.

## వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు



పంట పొలాలు పరిశీలిస్తున్న అధికారులు

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 3, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మండలం పందిళ్ల గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారిని జె.స్వరూపరాణి, హుస్నాబాద్ ఏడిఏ కె మల్లయ్యలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నష్టపోయిన రైతుల వివరాలను పరిశీలించి పంట నష్టం అంచనాలను వ్యవసాయ విస్తరణ అధికారులు తయారు చేసి నివేదిక పంపాలని తెలిపారు. రైతుల వారీగా వివరాలను సేకరించి మొబైల్ యాప్ అప్లోడ్ చేయాలన్నారు. హుస్నాబాద్ డివిజన్‌లో నష్టపోయిన పంట వివరాల సర్వే చేయడానికి 30 మంది ఎఈఓ లతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సమగ్ర సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. ఎఈఓలు పంట పొలాలను పరిశీలించి రైతుల వివరాలు సేకరించి సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏవో పూజతో పాటు ఏఈవోలు విజయ్, భాస్కర్ మరియు రైతుల పాల్గొన్నారు.

## వైభవంగా వేణుగోపాలస్వామి,ఆంజనేయ స్వామిల ప్రతిష్ఠాపన

**కొమురవెల్లి, నవంబరు 3,ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో మూడురోజుల పాటు జరుగుతున్న రుక్మిణి వేణుగోపాల సహిత అంజనేయస్వామి వారి ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గాడిచర్ల తిరుమలరావు కుటుంబ సభ్యులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్యాంప్రసాద్‌శర్మ పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమీకృత మార్కెట్ భవనం పనులను పూర్తి చేయాలి

### బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లిఖార్జునరెడ్డి

హుస్నాబాద్ రూరల్, నవంబరు 3, ప్రభాతవార్త : పెండింగ్‌లో ఉన్న శాఖాహార, మాంసాహార సమీకృత భవనం పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జునరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో పెండింగ్‌లో ఉన్న సమీకృత శాఖాహారం, మాంసాహారం భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో పట్టణాభివృద్ధిలో భాగంగా రూ 2కోట్ల 73 లక్షల వ్యయంతో నిర్మాణం చేయుటకు అప్పటి మంత్రి తన్నీరు హరీష్ రావు, అప్పటి శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్‌లు భూమిపూజ నిర్వహించి 2022లో శంకుస్థాపన చేశారని, 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం మారిందని, తర్వాద అధికారంలోకి కాంగ్రెస్ వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా పెండింగ్‌లో ఉన్న పనులను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. అసంపూర్తిగా పెండింగ్‌లో ఉన్న సమీకృత శాఖహారం, మాంసహార భవనం పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆంతోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్యస్ పార్టీ యూత్ అధ్యక్షులు మేకల వికాస్ యాదవ్‌తో పాటు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మల్లిఖార్జునరెడ్డి

# ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

### మెదక్ ఎమ్మెల్యే రోహిత్

**పాపన్నపేట, నవంబరు 3, ప్రభాతవార్త**

ధాన్యం విక్రయాలలో అపోహలు నమ్మవద్దని రైతులు పండించిన పంట చివరిగింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎల్లాపూర్, అన్నారం, యూసఫ్‌పేట గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ధాన్యం విక్రయ కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పారు. ప్రతి రైతు ధైర్యంగా ఉండాలన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. ఇది ప్రజల ప్రభుత్వమని పేర్కొన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని వివరించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం మల్లంపేటలో పార్టీ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి సహోదరుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తరుణ్‌రెడ్డి దశదినాకర్మలో పాల్గొన్నారు. ఆయన వెంట కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్, నాయకులు మల్లప్ప, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, నరేందర్‌గౌడ్, ఖాజా, మురళి, గౌస్, సతీష్, నాని, రాజశేఖర్, బాపురెడ్డి, మోహన్‌రెడ్డి, వివిధ గ్రామాల కార్యకర్తలు రైతులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు



ఎస్ఐ నారాయణగౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న బిజెపి నాయకులు

## దేశ సైనికులను కించపరచ్చడం సిగ్గుచేటు

**చిన్నశంకరంపేట, నవంబరు 3,ప్రభాతవార్త:** దేశం కోసం ఎంతో త్యాగం చేస్తున్న దేశ సైనికులను సీఎం రేవంత్ రెడ్డి కించపర్చేలా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని బిజెపి మండలాధ్యక్షుడు పోగుల రాజు అన్నారు. సోమవారం చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్‌కు బిజెపి నాయకులు సీఎం రేవంత్ రెడ్డిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆపరేషన్ సింధూర్‌పై, భారత సైన్యానికి వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, సురేష్‌గౌడ్, మూర్తి శంకర్, నరేందర్ రెడ్డి, మేడి శ్రీను, ఆకుల రాజు, శివశంకర్, యాచం వెంకన్న పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ఎన్నికల జోష్



పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

**చిన్నశంకరంపేట, నవంబరు 3, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేటలో జడ్పీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీప్లానాయక్ తెలిపారు. విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ, ఎన్నికల అధికారులు చేసే విధుల పట్ల అవగాహన కల్పించారు. ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులకు ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తులు, బ్యాలెట్ ఓటింగ్,నోటా, ఓట్ల లెక్కింపు వంటి అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా దీపిక, గోపాల్, పోలింగ్ అధికారులుగా ప్రవళిక, తేజస్వి, అక్షయలు వ్యవహరించి పోలింగ్‌ను నిర్వహించినట్లు తెలిపారు.

## నిబంధనలు పాటించి వాహనాలు నడపాలి

### -గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి

**గజ్వేల్ టౌన్, నవంబరు 3 (ప్రభాతవార్త):** ప్రతి ఒక్కరూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. సోమవారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమని, దీనిని సద్వినియోగం చేసుకున్నవారు బాగుపడతారని అన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దని, మైనర్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని చెప్పారు. సరదాకు మోటార్ సైకిల్ నడిపి ప్రమాదాలకు గురికావద్దన్నారు. అలాగే బాల్య వివాహాలు, ఈవిటీజింగ్, గుడ్ టచ్ బాడ్ టచ్, సోషల్ మీడియా, సైబర్ సెక్యూరిటీ, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి నుండి ఎలా రక్షణ పొందాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అజార్ హైమద్, ఉపాధ్యాయులు, షీటీమ్ సిబ్బంది ఏఎస్ఐ శ్రీరాములు, హెడ్ కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సిఐ మురళి



ఆయిల్ పామ్ మొక్కలను నాటుతున్న అధికారులు

## ఆయిల్ పామ్ సాగుతో లాభాలు బాగు

**నర్సాపూర్ రూరల్, నవంబరు 3,ప్రభాతవార్త:** ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని మండల వ్యవసాయాధికారి దీపిక అన్నారు. సోమవారం మండల పరిధి నత్నాయపల్లి, నర్సాపూర్ గ్రామంలో రైతు పరమేశ్వర్ రెండున్నర ఎకరాలు, అశోక్‌యాదవ్‌కు చెందిన 3 ఎకరాలలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ పామ్‌ను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలన్నారు. ఈ పంట సాగులో ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రూ. 200 ఉన్న మొక్కలకు రూ. 20 అందచేయడం జరుగుతుందన్నారు. డ్రిప్ సబ్సిడి ఎస్సీ,ఎస్టీ రైతులకు 100 శాతం, జనరల్ రైతులకి 90 శాతం వరకు రాయితీ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయాధికారి శ్రీదేవి, లీవ్ పామ్ రిసోర్సెస్ కంపెని టెక్నికల్ పర్సన్ అజయ్, వ్యవసాయ విస్తరణ అధికారులు మోహన్, తేజస్వీని, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షూలు అందజేత

**చిన్నశంకరంపేట, నవంబరు 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చందాపూర్‌లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపధ్యాయుడు పరమేశ్వర్ రెడ్డి సోమవారం షూలను అందించారు. విద్యార్థులకు నవోదయ పరీక్షలకు సిద్ధం అవ్వడానికి అవసరమయ్యే పుస్తకాలను అందించినట్లు ఆయన తెలిపారు. గతంలో ఉపాధ్యాయురాలు తోటవ్వ సైతం విద్యార్థులకు క్రీడా దుస్తులను అందించారు. సొంత డబ్బులతో పాఠశాల విద్యార్థులకు అవసరమయ్యే వాటిని సమకూర్చి వారికి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు.

## నిరుపయోగంగా మహతి ఆడిటోరియం



మాట్లాడుతున్న పొన్నాల కుమార్, దాసరి ఏగొండస్వామి

**గజ్వేల్ టౌన్, నవంబరు 3 (ప్రభాతవార్త):** గత ప్రభుత్వం హైదరాబాద్ లోని లలితకళాతోరణం, రవీంద్రభారతి మాదిరిగా గజ్వేల్ పట్టణంలో అత్యాధునికంగా 2019లో నిర్మించిన మహతి ఆడిటోరియం గత 11 నెలలుగా నిరుపయోగంగా, చెత్తాచెదారంతో ప్రజలకు అందుబాటులో లేకుండా ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పొన్నాల కుమార్, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామిలు అన్నారు. సోమవారం మహతి ఆడిటోరియం వద్ద వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.19.47 కోట్ల వ్యయంతో రెండు ఎకరాల విస్తీర్ణంలో 1100 మంది కూర్చునే విధంగా విశాలవంతమైన హాల్‌ను, 200 మంది కూర్చునే విధంగా మినీ హాల్‌ను వివాహాలు, ప్రభుత్వ, కార్పొరేట్ ఈవెంట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి అనుకూలంగా నిర్మించడం జరిగిందన్నారు. ఈ మహతి ఆడిటోరియం లీజ్‌కు ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి ప్రతినెలా ఒక లక్షా 80వేల ఆదాయం కూడా వస్తుండేదని, గత 11 నెలలుగా ఆడిటోరియం అందుబాటులో లేకపోవడం వల్ల ప్రభుత్వ ఖజానాకు, ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. వెంటనే ప్రారంభించి ప్రజలకు ఆడిటోరియంను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

## ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో నూతన పాఠశాల భవనం ప్రారంభం

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబరు 3, ప్రభాతవార్త :** సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేటలో 63 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఓసాట్ (ఓఎస్ఏటి) అనే స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయంతో, మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన భవన నిర్మాణం పనులను సంస్థ ప్రతినిధి మధుసూదన్ రెడ్డి గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు ఓ సాట్ సంస్థ ఇప్పటివరకు భారతదేశంలో 117 పాఠశాలలను నూతనంగా నిర్మించి ఆయా ప్రభుత్వాలకు అప్పగించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు మొక్కజొన్న పంటపై అవగాహన



రైతులకు మొక్కజొన్న పంటపై అవగాహన కల్పిస్తున్న రాజ్‌నారాయణ

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 3, ప్రభాతవార్త :** జాతీయ ఆహార భద్రత పథకం కింద కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాల పంపిణీ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం రామయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు మొక్కజొన్న పంటపై అవగాహనతో పాటు సబ్సిడీపై విత్తనాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమం పర్యవేక్షణలో ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ మాట్లాడుతూ వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయడాన్ని ప్రోత్సహిస్తూ మొక్కజొన్న సాగు విస్తరణకు విభాగం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులకు పంట విత్తనం దశ నుంచి పంట కోత దశ వరకు అన్ని సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకంతో మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి విత్తనాలను పొందవచ్చునన్నారు. జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ (ఎన్ ఎస్ సి) రూపొందించిన సీ.టి.4260 హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నారు. ఈ రకం పంట కాలం 115-120 రోజుల మధ్యలో పూర్తవుతుంది. యాసంగి సీజన్‌కు అనుకూలంగా ఉండే ఈ రకం చీడపీడలను తట్టుకొని అధిక దిగుబడి ఇవ్వగలదని అధికారులు తెలిపారు. నాలుగు కేజీల మొక్కజొన్న విత్తనం బ్యాగు ధర రూ.1380 కాగా, రూ.400 సబ్సిడీ, రైతులు కేవలం రూ.980 చెల్లించి విత్తనం పొందవచ్చు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రవీణ్ కుమార్‌తో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## శ్రీరామకోటి ఆధ్వర్యంలో మహాశివునికి పూజలు

**గజ్వేల్ టౌన్, నవంబరు 3 (ప్రభాతవార్త):** శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా అద్దాల మందిరం వద్ద మహాశివునికి భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ పరమ శివునికి అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీకమాసం అని, ఈ మాసంలో వ్రతాలు, పూజలు, ఉపవాసాలు, వనభోజనాలు భక్తితో చేసుకోవాలన్నారు. పంచాక్షరీ నామం అయినటువంటి ఓం నమశ్శివాయ మంత్రాన్ని ప్రతి క్షణం స్మరించి ముక్తిని పొందాలన్నారు.

## భారత్ మహిళా క్రికెట్ విజయం పట్ల హర్షం..

### స్వయంభూ రాజరాజేశ్వర స్వామి దేవాలయం వరకు పాదయాత్ర

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 3, ప్రభాతవార్త :** భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్(విశ్వవిజేత) గెలిచినా సందర్భంగా ప్రముఖ సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు సోమవారం రోజున హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం వెంకటేశ్వర్లపల్లి (పీవీ నరసింహారావు కాలనీ) నుంచి పాదయాత్ర చేసి హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి శ్రీస్వయంభూ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కోడె మొక్కలు చెల్లించారు. అనంతరం మాట్లాడుతూ గత యాభై ఏళ్ళు గా మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొని మొదటి సరిగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విశ్వవిజేత గా నిలిచి చరిత్ర సృష్టించడంతో యావత్ దేశం గర్వపడుతుందని హర్షం వ్యక్తం చేశారు. జాతీయ జెండాను ప్రదర్శించి దేశభక్తిని చాటుకున్నారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన మహిళా క్రీడా సభ్యులందరికి అభినందనలు తెలిపారు.

## మల్లన్న సన్నిధిలో ఘనంగా కార్తీక దీపోత్సవం

**కొమురవెల్లి, నవంబరు 3, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నధిలో సోమవారం కార్తీక మాసంలో భాగంగా కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి మహామండపంలో కార్తీక దీపోత్సవంలో భాగంగా 13 రోజు శివ సహస్ర నామావళి పారాయణ పూర్వక దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, గ్రామస్తులు, భక్తులు దీపోత్సవంలో పాల్గొని తరించారు. ఆలయ సిబ్బంది భక్తులకు దీపప్రమిదలు,పూజ సామాగ్రి సమకూర్చారు. అనంతరం ఆలయ అర్చకులు దీపోత్సవంలో పాల్గొన్న సువాసినులకు ప్రసాద తాంబూలాలను అందజేసి ఆశీర్వదించారు.

## రేణుక ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ట ఆహ్వాన పత్రిక అందజేత



ఆహ్వాన ప్రతికను అందజేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, నవంబరు 3, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కొమురవెల్లిలో ఈనెల 6 నుంచి 8 వరకు జరిగే శ్రీ రేణుక ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వాములపల్లి రాజు జనగామ డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అంజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల మెరుగు శ్రీనివాస్, మంజ మల్లేశం, దాసరి శ్రీకాంత్, బొచ్చు ఎల్లయ్యయాదవ్, స్వాములపల్లి రమేష్‌పాల్గొన్నారు.

## మల్లన్న సన్నిధిలో పరిసరాలను పరిశీలించిన పోలీసు అధికారులు



మల్లన్న దేవాలయంలో పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

**కొమురవెల్లి, నవంబరు 3, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందుల కలగకుండా పరిసరాలను హుస్నాబాద్ ఏసిపి సదానందం, చేర్యాల సీఐ శ్రీను, ఎస్ఐ రాజులు సోమవారం పరిశీలించారు. భక్తుల దర్శనాలకు ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు, కళ్యాణ వేదిక వివిధ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ఆలయ సూపరింటెండెంట్ నీల శేఖర్, సిబ్బంది మధుకర్, భాస్కర్, శంకర్‌శర్మ తదితరులు ఉన్నారు.

## పెద్ద చెరువుకట్టపై గంగభవాని కమాన్‌కు భూమి పూజ



పెద్దచెరువు కట్టపై గంగ భవాని కమాన్‌కు భూమి పూజ చేస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, నవంబరు 3, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుడిసె లక్ష్మయ్య, సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం పెద్ద చెరువుకట్ట ప్రారంభంలో గంగ భవాని కమాన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా గంగపుత్ర సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ పెద్ద చెరువు కట్టపై పలు పుణ్యక్షేత్రాలు ఉండడం సంతోషంగా ఉందన్నారు. కాటమయ్య గుడి, హనుమాన్ దేవాలయాలు ఉండడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, గంగపుత్ర సంఘం సభ్యులు కామిని ఉమేష్‌చంద్రం, జంగిటి శ్రీనివాస్, ఇట్టబోయిన శ్రీనివాస్, పిన్నింటి అబ్బరెడ్డి, కుండె తిరుపతి, లక్ష్మయ్య, మిట్టపల్లి కనకరాజు, బంక చిరంజీవి పాల్గొన్నారు.

## పాపన్నపేటలో రక్తదాన శిబిరం

**పాపన్నపేట, నవంబర్ 3, ప్రభాతవార్త :** రక్తదానం చేసి మరొకొందరికి ప్రాణదానం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి నీల శామ్‌జి అన్నారు. అయోధ్య భవ్య రామ మందిరం నిర్మాణం కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన కొఠారి బ్రదర్స్‌ను, కరసేవ కోసం ప్రాణాలర్పించిన కరసేవకులను స్మరించుకుంటూ వారి ఆశయ సాధనాల కోసం హుతాత్మ దివాస్ సందర్భంగా విహెచ్‌పి బజరంగదళ్ ఆధ్వర్యంలో సోమవారం పాపన్నపేటలోని వెంకటేశ్వర హాస్పిటల్ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మహనీయుడి స్మరిస్తూ నా దేశం నా ధర్మం నా రక్తం అనే భజరంగదళ్ సేవా విభాగం రక్తదానం చేశారు. మెదక్ జిల్లా విద్యార్థి బజరంగదళ్ ప్రముఖ్ బోలకృష్ణ , మండల ఉపాధ్యక్షులు కరేల వెంకటేశం, ప్రకాండ గోరక్ష సహ ప్రముక్ ప్రసాద్, ప్రఖండ సాహ సంయోజక్ అట్కారి అరుణ్ రావు, సుదర్శన్ పంతులు, ప్రేమ్ సాగర్, పోతేధర్ అభినయ్, ఆర్టీసీ కరోల పెంటయ్య, మాజీ ఎంపీటీసీ గణేష్, దుర్గాప్రసాద్‌చారి పాల్గొన్నారు.

## ఫీజుల రీయింబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

**పాపన్నపేట, నవంబరు 3, ప్రభాతవార్త:** పెండింగ్‌లోఉన్న స్కాలర్‌షిప్, ఫీజుల రీయింబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం వెంటనే చెల్లించాలంటూ ఎబివిపి ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతోకలిసి మెదక్ బొడ్మట్‌పల్లి రహదారిపై పాపన్నపేటలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎబివిపి నాయకులు లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన 8,500 పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీంతో ఇరు పక్కల వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పి పంపించి వేసి రోడ్డును క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సంతోష్, వినయ్, విక్రమ్, ఆదిలక్ష్మి, సుజాత, ప్రవీణ్, శివ, విశ్వేశ్వర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## అయ్యప్ప మహాపడి పూజలో కార్పొరేటర్

**రామచంద్రాపురం, నవంబరు 3, ప్రభాతవార్త:**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజి కాలనీలోని నేతాజీ కమ్యూనిటీ వద్ద సోమవారం శ్యాంగౌడ్, మిన్నుగౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీఅయ్యప్పస్వామి 18వ మహాపడి పూజలు శోభాయమానంగా జరిగాయి. పూజా కార్యక్రమాలకు భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## యుఐఎఫ్‌డి నిధులతో పేటను అభివృద్ధిపరచండి


మాట్లాడుతున్న గ్రాడ్యుయేషన్ అధ్యక్షుడు విశాల్‌కుమార్

**మునిపల్లి, నవంబరు 3, ప్రభాతవార్త:**
అవినీతికి తావులేకుండా ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సదాశివపేట గ్రాడ్యుయేషన్ కమిటీ పురపాలకశాఖ కమిషనర్ శివాజీని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపాలిటీలలో ప్రజలకు కావలసిన మౌలిక వసతుల కోసం ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఇందులోభాగంగా సదాశివపేట మున్సిపాలిటీ రూ.15కోట్లు కేటాయించారని కమిషన్ శివాజీ తెలిపారు. ఈనిధులతో ముఖ్యంగా సదాశివపేటలో కొత్తగా ఏర్పడిన కాలనీలలో మురికికాలువలు, రోడ్డు అభివృద్ధి పరచాలని వారు అన్నారు. మురికికాలువలు లేకపోవడం వలన నీరు గుంటలలోచేరి దోమలబెడద పెరిగిందని దీనివలన ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారని వారు అన్నారు. వెంటనే టెండర్లు పిలిచి అవినీతికి తావులేకుండా పట్టణాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని ఈసందర్భంగా కమిషనర్‌ని కోరారు. ఈ సమావేశంలో సెక్రెటరీ రాధాకృష్ణ, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల సంఘాల మహిళలకు అవగాహన


గ్రామాల సంఘాల మహిళలకు అవగాహన కల్పిస్తున్న సిఆర్‌పిలు

**మనూర్, నవంబరు 3, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన మనూర్‌లో మండలంలోని ఆయా గ్రామాల్లోని మహిళాసంఘాల మహిళలకు రెండురోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం పరిశీలన, సోమవారం శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సిఆర్‌పిలు వరలక్ష్మి, కవితలు మాట్లాడుతూ మండల సమాఖ్య సమావేశాలు జరుపుకునే తీరు, చేయాల్సి న, చేయకూడని పనులపై వివరించారు. అందుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని, ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమపథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం అనంతయ్య, సంజీవ్‌కుమార్, గ్రామాల మహిళాసంఘసభ్యులు పాల్గొన్నారు.

## వాసర పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ


రంగురంగు బొమ్మలతో ఉన్న తరగతిగది దృశ్యం

**సిర్గాపూర్, నవంబరు 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని వాసర్‌గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం మండలవిద్యాధికారి నాగారం శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి పాఠశాలలో కొనసాగుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్ బోధన విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులప్రగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. చదవడం, రాయడం, గణితం ఎలా అమలు అవుతున్నది అని పరిశీలించారు. మధ్యాహ్నభోజనం వండే కార్మికులతో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, వారానికి మూడురోజులు గుడ్లను అందచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంగ్రామ్, ఉపాధ్యాయులు స్వరూప, సిఆర్‌పి శివకుమర్‌లు ఉన్నారు.

**రూమ్ టు రీడ్ విద్యార్థులకు వరం...**
ప్రభుత్వ అనుమతితో రూమ్ టు రీడ్ స్వచ్ఛందసంస్థ మండలకేంద్రమైన సిర్గాపూర్‌తోపాటు మండలంలోని వాసర్‌గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో సులభబోధన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఆయా పాఠశాలలో తరగతిగదులను రంగులతో అద్ది రంగురంగు బొమ్మలు చిత్రీకరించి, తరగతిగదిలో చిన్నారివిద్యార్థులు కూర్చునేందుకు ఫర్నిచర్, లైబ్రరీ, పుస్తకాలు పెట్టుకునేందుకు బీరువాలు సిద్ధంచేసి గదులను ఇంపుగా తయారుచేసి చిన్నారి విద్యార్థులు ఇష్టంగా తరగతులకు హాజరయ్యేలా చొరవ తీసుకుంటున్నట్లు మండలవిద్యాధికారి నాగారం శ్రీనివాస్ పేర్కొన్నారు.

## సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న ఉజ్వల్‌రెడ్డి


సదరు ఉత్సవాల్లో పాల్గొనన కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి

**జహీరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంలో ఆదివారం యాదవసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రనాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి పాల్గొని యాదవులకు సదర్ ఉత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో సదర్ ఉత్సవాలు సంప్రదాయంగా ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.నర్సింహారెడ్డి, పి.నాగిరెడ్డి, నథానెయల్, హర్షవర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కిరణకుమార్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ఇమామ్‌పటేల్, అరుణ్‌కుమార్, పాండుయాదవ్, సాయియాదవ్, పవన్ యాదవ్, యాదవసంఘం నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## గూడూరులో పశువైద్య సిబ్బంది సక్సెస్

**నాగల్‌గిద్ద, నవంబరు 3, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని గూడూరులో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకున్నారు. గ్రామానికి చెందిన రైతులు తాము సాకుకుంటున్న 2వందలకు పైగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించుకున్నారు.

# నల్లవాగు ప్రాజెక్టులోకి చేపపిల్లలు

**-బిఆర్ఎస్ నిర్లక్ష్యంతోనే ఆలస్యంగా చేపపిల్లల విడుదల**
**-ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**


నల్లవాగు ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**సిర్గాపూర్, నవంబరు 3, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టులో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అధికారులతో కలిసి 11లక్షల 4వేల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి కాంగ్రెస్‌ప్రభుత్వం 100శాతం రాయితీపై ప్రాజెక్టులోకి చేప పిల్లలను వదిలామన్నారు. ఇటీవల భారీ వర్షాలు కురియడంతో పాటు గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపపిల్లల కాంట్రాక్టర్లకు 128 కోట్ల రూపాయలను బకాయి పెట్టడంతో ఈమారు ప్రాజెక్టులోకి చేపపిల్లలను వదలడం ఆలస్యమయిందని, రానున్న సంవత్సరంలో ఇలా ఆలస్యం కాదన్నారు. మత్స్యశాఖ మంత్రి గంగపుత్రుడని వారి సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రాజెక్టులో వదిలిన చేపపిల్లలు పెద్దయ్యాక మత్స్యకారులు పట్టుకుని అమ్ముకుని ఉపాధి పొందవచ్చన్నారు. పేదల స్వంతింటికల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని, లబ్ధిపొందిన లబ్ధిదారులు సకాలంలో ఇళ్లను కట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గున్నల నర్సింలు, ఆయాశాఖల అధికారులు, గంగపుత్రులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో వరి కొనుగోలుకేంద్రాల ఏర్పాటు

**-మండల కాంగ్రెస్ అధ్యక్షులు నత్తి దశరథ్**


వరి కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చౌటకూరు, నవంబరు 3, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కోర్పోల్, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నత్తి దశరథ్, మల్లారెడ్డిలు మాట్లాడుతూ మండలంలో దాదాపుగా ప్రతిగ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేశామన్నారు. రైతులు కొనుగోలుకేంద్రాలకు ధాన్యం తరలించి లబ్ధిపొందాలని, మధ్యదళారులకు అమ్ముకుని ఆగంకావద్దన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ కో-ఆర్డినేటర్ వంశీ, ఆలయ కమిటీ చైర్మన్ భూనూరి లక్ష్మయ్య, మండలకాంగ్రెస్ ప్రధానకార్యదర్శి రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు రామాగౌడ్, నాయకులు కలాలీ ఈశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరెడ్డి, మహేశ్, రాజశేఖర్, వర్కల రమేశ్, సంజయ్, మల్లికార్జున్‌గౌడ్, శివరాజ్‌గౌడ్, అశోక్, గోపాల్, ఆగమయ్య, ప్రభాకర్, ఏఈఓ దత్తురాజ్ పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి

**-కదంతొక్కిన విద్యార్థులు**


బిల్లులు విడుదలకు ఆర్‌డిఓకు వినతిపత్రం అందచేస్తున్న విద్యార్థులు

**జహీరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:**
జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు బకాయిపడిన స్కాలర్‌షిప్ రియంబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే విడుదలచేయాలని సోమవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థిసంఘం (పిడిఎస్‌యు) ఆధ్వర్యంలో విద్యార్థులు కదంతొక్కారు. సోమవారం పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాల నుంచి ఆర్‌డిఓ కార్యాలయం వరకు విద్యార్థులతో కలిసి పిడిఎస్‌యు నాయకులు ర్యాలీగా కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించి ఆర్‌డిఓకు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా పిడిఎస్‌యు డివిజన్ అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్ మాట్లాడుతూ బకాయిలో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదలకాక ఎస్సీ, ఎస్టీ,బిసి,మైనార్టీ విద్యార్థులు విద్యకు దూరం అయ్యే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి బకాయిబిల్లులను విడుదల చేయకుంటే రానున్నరోజుల్లో జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణంలోని ప్రయివేటు జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు, పిడిఎస్‌యు సంఘం నాయకులు ఇ.గోపాల్, జి.రాకేష్, నిరుధ్, వంశీ, నాగరాజ్, గణేష్, నాగశ్రీ, అక్షిత, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలను దర్శించుకున్న ఎమ్మెల్సీ కుటుంబసభ్యులు

**రామచంద్రాపురం, నవంబరు 3, ప్రభాతవార్త:**
ఆంధ్రప్రదేశ్‌లోని ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. విఐపి ప్రారంభం సమయంలో స్వామి వారి సేవలో పాల్గొన్నారు. టిటిడి అధికారులు ఎమ్మెల్సీ అంజిరెడ్డిని, అంజిరెడ్డి ధర్మపత్ని సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు చిన్నమైల్ గోదావరిలకు సాదరస్వాగతం పలికి దర్శనం ఏర్పాటుచేశారు. స్వామివారి దర్శనం అయ్యాక రంగనాయకుల మండపలంలో వేదపండితులు వేదాశీర్వచనాలుచేసి తీర్థప్రసాదాలను అందచేశారు.

## అభివృద్ధికి ఆదర్శంగా రామచంద్రాపురం

**-35లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ శ్రీకారం**


సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజలు చేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, నవంబరు 3, ప్రభాతవార్త:**
అభివృద్ధి పనులకు రామచంద్రాపురం డివిజన్ ఆదర్శంగా ఉంటుందని కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ అన్నారు. సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో 11,12 బ్లాక్‌లలో 35లక్షల జిహెచ్‌ఎంసి నిధులతో నిర్మించే సిసి రోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సిసి రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమలో ఎల్వర్తి మల్లేశం, పుట్నాల అశోక్, పుట్నాల సత్యనారాయణ, పుట్నాల సురేందర్, జన్ముల యాదయ్య, కుమార్, మహేందర్‌రెడ్డి, పీటర్ పాల్స్, గారెల్ల శ్రీశైలం, కాశాల వీరేశం, స్మామ్రాట్, మల్లేశ్, బికె శ్రీనివాస్, గొంత్యాల వీరేశం, గొంత్యాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఉపముఖ్యమంత్రితో కలిసి ఇంటింటి ప్రచార నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే


ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, నవంబరు 3, ప్రభాతవార్త:**
జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భాగంగా ఎర్రగడ్డ డివిజన్ పరిధిలో 388, 320, 321 బూత్‌లలో తెలంగాణరాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి గౌరవ మహమ్మద్ అలీతో కలసి నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌ని భారీమెజార్టీతో గెలిపించాలని ఇంటింటిప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, బూత్ ఇన్చార్జ్‌లు నాయకులు తదితరులు ఉన్నారు.

## గుంతలమయంగా ఇరక్‌పల్లి రోడ్డు.. పట్టించుకోరెవరూ..


గుంతలమయంగా మారిన ఇరక్‌పల్లి రోడ్డు

**నాగల్‌గిద్ద, నవంబరు 3, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఇరక్‌పల్లికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో అటుగా ప్రయాణించే వాహనచోదకులు, ప్రయాణీకులు నిత్యం పాట్లు పడుతున్నారు. గ్రామానికి వచ్చే అధికారులు, పాలకులు గ్రామానికి రోడ్డు సౌకర్యం సక్రమంగాలేదని గ్రహించినా, మరమ్మతులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# తండాలో ప్రమాదకంగా విద్యుత్ తీగలు


విఠల్‌నాయక్ తండాలో వేలాడుతున్న విద్యుత్ తీగల దృశ్యం

**పుల్‌కల్, నవంబరు 3, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని విఠల్‌నాయక్ తండాలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. తండా సమీపంలోని వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ స్తంభాలను పాతి విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. 45 మీటర్లకు ఒక విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటుచేయాల్సి ఉండగా తండాశివారులో 60 నుంచి 70 మీటర్ల దూరంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసి తీగలు అమర్చడంతో విద్యుత్ తీగలు నేలనుతాకేలా వంగిపోయాయి. అటుగా వెళ్లేందుకు నిత్యం రైతులు పడుతున్న పాట్లు చెప్పనలవిగాకుండా ఉన్నాయి. ఎక్కడ కరెంట్ షాక్‌కు గురవుతామో అన్న భయంతో గిరిజనులు దినదినగండంగా రోజులు గడుపుతున్నారు. లక్ష్మీసాగర్ పరిసరాల్లోని 7 గిరిజన తండాల్లోని వ్యవసాయ భూముల వద్ద ఇదే దుస్థితి దాపురించి ఉంది. విద్యుత్ వైర్లు నేలను తాకుతుండటంతో ధాన్యం నూర్పిడి యంత్రాల సహాయంతో చేసుకునే అవకాశం లేకుండాపోయిందని గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలను సరిచేయాలని పలుమార్లు ట్రాన్స్‌కో ఎఈ, లైన్‌మెన్‌లకు, హెల్పర్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గిరిజన రైతులువ విచారం వ్యక్తంచేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి ప్రాణాలకు ప్రమాదకంగా మారిన విద్యుత్ తీగలను సరిచేయాలని ఆయాతండాల గిరిజన రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## చేవెళ్ల రోడ్డుప్రమాదంపై అరుణ్‌రాజ్ దిగ్భ్రాంతి

**సిర్గాపూర్, నవంబరు 3, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన చేవెళ్లవద్ద సోమవారం జరిగిన ఘోర రోడ్డుప్రమాదంపై బిజెపి సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఆరుణ్‌రాజ్ శేరికార్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. తాండూరు డిపోకు చెందిన బస్సును కంకరలోడ్‌తో వెళుతున్న లారీ ఢీకొనడంతో రోడ్డుప్రమాదంలో 21 మంది తిరిగిరాని లోకాలకు చేరిపోవడం కలిచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు రాష్ట్రప్రభుత్వం అండగా ఉండి పరిహారం అందించాలన్నారు.

## చేవెళ్ల బస్సు ప్రమాదంపై ఎమ్మెల్సీ దిగ్భ్రాంతి

**-మృతుల కుటుంబాలకు 10 లక్షలు అందచేయాలి**
**-పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి**

**రామచంద్రాపురం, నవంబరు 3, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. తాండూరు డిపోకు చెందిన ఆర్టీసి బస్సును కంకరలోడ్‌తో వెళుతున్న లారీ ఢీకొన్న సంఘటనలో 21మంది మృతిచెందడం కలిచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైనవైద్యం అందించేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు, క్షతగాత్రులకు రూ.2లక్షల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని రాష్ట్రప్రభుత్వానికి డిమాండ్‌చేశారు. కంకరలోడ్‌తో వెళుతున్న లారీకి టార్పాలిన్ కవర్ ఉంటే ప్రమాదం ఇంతఘోరంగా ఉండేదికాదని అభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రభుత్వం, రవాణాశాఖ ఇలాంటి ఏర్పాట్లు చేసేలా కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిలారీ, డిసిఎంలకు ప్రమాద బీమా కల్పించేలా మార్గదర్శకాలు రూపొందించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా తగుచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్ చేశారు.

## సన్నవరి సేకరణకు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి

**-డిప్యూటీ తహసీల్దార్‌కు రైతులు వినతి**


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న రైతులు

**చౌటకూరు, నవంబరు 3, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన చౌటకూరులో సన్నవరిని సేకరించేందుకు ప్రభుత్వం కొనోగులుకేంద్రాన్ని ఏర్పాటుచేయాలని వినతిచేస్తూ రైతులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో అనేకమంది రైతులు సన్నవరిని సాగుచేసుకున్నారని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరి కొనుగోలుకేంద్రాల్లో సన్నధాన్యం తీసుకునేందుకు నిరాకరిస్తున్నారన్నారు. సన్నధాన్యానికి 5వందల రూపాయల బోనస్ ఇస్తామన్నా, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం తీసుకునేందుకు ఇష్టపడకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తమకు ప్రభుత్వంనుంచి సన్నధాన్యం తీసుకోవాలన్న ఆదేశాలు రాలేదని కేంద్రాల నిర్వాహకులు పేర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం తీసుకోకుంటే ఆధాన్యం ఎక్కడ అమ్ముకోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి సన్నధాన్యం కొనుగోలుచేసేలా కొనుగోలుకేంద్రాలను ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో రైతులు తలారి దేవయ్య, నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజు, వెంకటేశం, సాయిలు తదితరులున్నారు.

## చౌటకూరులో లీకైన పైప్‌లైన్

**-రోడ్డుపై వృథాగా తాగునీరు**


మంచినీటి పైప్‌లైన్ లీకై రోడ్డుపై తాగునీరు ప్రవహిస్తున్న దృశ్యం

**చౌటకూరు, నవంబరు 3, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరులో మంచినీటి పైప్‌లైన్ లీక్ కావడంతో తాగునీరు రోడ్డుపాలవుతోంది. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ముందు నుంచి కింది బజార్‌కు వెళ్లే ప్రధాన పైప్‌లైన్ లీకేజి అయినా, పట్టించుకునేవారు కరువవడంతో మంచినీరు రోడ్డుపాలవడంతోపాటు ఇళ్లకు సరఫరా అయ్యే నీరు కలుషితం అవుతోంది. కలుషిత నీరు సేవించి ప్రజలు ఎక్కడ అనారోగ్యానికి గురవుతామో అని భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్యదర్శి పట్టించుకుని లీకవుతున్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు సూచిస్తున్నారు.

## బొడ్మట్‌పల్లిలో మట్టి రోడ్డు పనులు ప్రారంభం

**-మంత్రికి కృతజ్ఞతలు తెలియజేసిన గ్రామస్థులు**


బొడ్మట్‌పల్లిలో మట్టి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

**టేక్మాల్, నబంబరు 3, ప్రభాతవార్త:**
టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో సోమవారం మట్టి రోడ్డు పనులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు బొడ్మట్‌పల్లి నుండి బర్దీపూర్‌వెళ్లే మట్టిదారి పూర్తిగా కొట్టుకుపోయింది. గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, అధికారబృందానికి గ్రామసమస్యలను విన్నవించారు. వెంటనే మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించి బాధిత కుటుంబాలకు అధికారులసహకారంతో తక్షణసహాయనిధులతో మట్టి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుచేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు, జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్, సంబంధిత అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్‌నాయకులు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

**-ఎవో అభినాష్‌వర్మ**

**న్యాల్‌కల్, నవంబరు 3, ప్రభాతవార్త:**
సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకానిజేషన్ 2025-26 (ఎస్‌ఎంఎఎం)లో భాగంగా రైతులు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ తెలిపారు. గతంలో అందుకోని రైతులకు మొదటిప్రాధాన్యత ఉంటుందన్నారు. రైతులకు అందుబాటులో బ్యాటరీ, చేతిపంపులు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు, రోటవేటర్స్, బ్రష్‌కటర్, కల్టివేటర్, ఎంబిప్లౌ, పవర్ వీడర్స్ తదితర పరికరాలు అందుబాటులో ఉన్నాయని రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎస్‌సి,ఎస్టి, మహిళారైతులకు, సన్న,చిన్నకారు రైతులకు 50శాతం, ఇతరరైతులకు 40శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందచేయడం జరుగుతుందన్నారు. రైతులు పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ట్రాక్టర్ ఆర్‌సిల జిరాక్సులు క్లస్టర్ ఎఈఓలకు అందచేయాలని మండల రైతులకు సూచించారు.